క్లుప్తంగా

టైలరింగ్ శిక్షణ ప్రారంభం



శిక్షణకు హాజరైన మహిళలు

రాజానగరం: డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరామపురంలో శుక్రవారం టైలరింగ్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సుమారు 60 మంది మహిళలు హాజరయ్యారు. ఇప్పటికే ఈ గ్రామంలో మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి చేశామని, ఇది రెండో బ్యాచ్ అని నిర్వాహకుడు, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర వెంకటేశ్వరరావు తెలిపారు. ఈవూరి దుర్గ ట్రైనర్‌గా వ్యవరిస్తున్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి, స్థానికులు పాల్గొన్నారు.

హోమియో వైద్యశిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ భరత్

సీతానగరం: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఇనుగంటివారిపేట ఎస్సీపేటలో శుక్రవారం హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచ్ సత్యం రాంపండు ప్రోద్బలంతో జైరామ్ జైభీమ్ సేవా సమితి వ్యవస్థాపకుడు వై.రాము ఆధ్వర్యంలో రాజమహేంద్రవరానికి చెందిన ఆయుష్ హాస్పటల్ సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 63 మందికి డాక్టర్ ఆర్‌వీఎస్ భరత్ వైద్యసేవలు అందించారు. బీపీ, బ్లడ్ సుగర్ వంటి పలు రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రసన్నకుమార్, ఎం.కుమార్, ఐ.రాజు, ఎం.చందు పాల్గొన్నారు.

91.38 శాతం పింఛన్ల అందజేత

బిక్కవోలు: మండలంలోని శుక్రవారం సాయంత్రానికి 91.38 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్టు ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. మండలం వ్యాప్తంగా 10,868 పింఛన్ల గాను 9,931 పంపిణీ చేసి 91.38 శాతం అయిందన్నారు. శనివారం సాయంత్రం నూరుశాతం పూర్తి చేస్తామని ఆమె తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ



శాంతరత్నానికి పింఛన్ అందిస్తున్న సచివాలయ సిబ్బంది

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి సచివాలయానికి చెందిన మామిడిపల్లి శాంతరత్నం గుండె సంబంధిత సమస్యతో రాజమహేంద్రవరం ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొందుతోంది. సచివాలయం సిబ్బంది శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి ఆమెకు పింఛన్ అందజేశారు.

పాస్టర్ కుటుంబ సభ్యులపై అట్రాసిటీ కేసు

రంగంపేట: పాస్టర్, అతని కుటుంబ సభ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్సై పి.విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం..రంగంపేటలో పాస్టర్‌గా పని చేస్తున్న చేబ్రోలు హరీష్‌బాబు అనే వ్యక్తి ఏకార్ట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ప్రకాశం జిల్లా దర్శికి చెందిన మహిళ గుడుపల్లి ప్రసన్నకుమారి మూడేళ్ల క్రితం రూ.26 లక్షలు పెట్టుబడి పెట్టించినట్టు చెప్పారు. కొంతకాలం తరువాత ప్రసన్నకుమారి తన డబ్బులు ఇవ్వాలని అడుగుతుండగా రూ.6.50 లక్షలు ఇచ్చారని మిగతా సొమ్ము కూడా ఇవ్వాలని ప్రసన్నకుమారి గట్టిగా పట్టుబట్టడంతో పాస్టర్ హరీష్‌బాబు, అతని కుటుంబ సభ్యులు ప్రసన్నకుమారిని కులం పేరుతో దూషించి, కొట్టారని దీంతో బాధితురాలు ప్రసన్నకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పాస్టర్ హరీష్‌బాబు, అతని కుటుంబ సభ్యులపై ఛీటింగ్, అట్రాసిటీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

బత్తిన సుబ్బారావుకు నివాళి



బత్తిన సుబ్బారావు విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: మాజీ మంత్రి బత్తిన సుబ్బారావు వర్ధంతి సందర్భంగా బొమ్మూరు బత్తిన సుబ్బారావు కమ్యూనిటీ హాల్లోని ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అరుంధతీపేటలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు.

ఈ ప్రభుత్వం.. అగ్రవర్ణాల నేస్తం

- కాపు నేస్తం, ఈబీసీ నేస్తం కింద ఏటా రూ.15 వేల సాయం
- 45 నుంచి 60 ఏళ్ల మహిళలు అర్హులు
- నాలుగు విడతల్లో రూ.60 వేల లబ్ధి
- కాపు, అగ్రవర్ణ పేదలను దగా చేసిన గత టీడీపీ సర్కారు



వేండ్రలో ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాపు సామాజిక వర్గం అక్కచెల్లెమ్మలు (ఫైల్)

పెదపూడి: ఎన్నికల మేనిఫెస్టోలో లేకున్నా ఏలాంటి హామీ ఇవ్వకపోయినప్పటికీ కాపు సామాజిక వర్గానికి, అగ్రవర్ణ కులస్తులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. ఆయా సామాజిక వర్గాలకు చెందిన గ్రామీణ పట్టణ మహిళల వికాసానికి తోడ్పాటునందించింది. కాపు కార్పొరేషన్ నుంచి వైఎస్సార్ కాపు నేస్తం కింద 45 నుంచి 60 ఏళ్ల లోపు కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల మహిళలకు ఏటా రూ.15 వేల చొప్పున ఐదేళ్లలో మొత్తం రూ.75వేల సాయాన్ని అందిస్తోంది. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో రూ.60వేల లబ్ధి చేకూర్చింది. ఇదే మొత్తాన్ని ఈబీసీ నేస్తం పేరిట బ్రాహ్మణ, వైశ్య, కమ్మ, రెడ్డి, కులాల్లో పేదలకు అందించింది.

కాపు, అగ్రవర్ణ పేదలపై టీడీపీ చిన్నచూపు

గత టీడీపీ సర్కారు కాపు సామాజిక వర్గం, అగ్రవర్ణ పేదలపై చిన్నచూపు చూసింది. కాపు రిజర్వేషన్ల విషయంలోనూ దగా చేసింది. ఏడాదికి వెయ్యికోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.5వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకుండా వంచించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కాపు కార్పొరేషన్ నుంచి ఏడాదికి రూ.2 వేల కోట్ల చొప్పున 5 ఏళ్లలో రూ.10 వేల కోట్ల ఖర్చు చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొనగా, అంతకంటే మిన్నగా మేలు చేయడం గమనార్హం.

అనపర్తి నియోజకవర్గంలో కాపునేస్తం పథకం వివరాలు

మండలం	నాలుగు విడతల్లో మొత్తం లబ్ధిదారులు	మొత్తం లబ్ధి
అనపర్తి	381	1,57,25,000
బిక్కవోలు	921	3,24,15,300
రంగంపేట	2150	8,00,76,000
పెదపూడి	1977	8,70,45,000
మొత్తం	5429	21,52,61,300

ఈబీసీ నేస్తం పథకం వివరాలు

అనపర్తి	21883	7,53,84,000
బిక్కవోలు	1467	2,91,40,500
రంగంపేట	504	1,47,00,000
పెదపూడి	979	2,55,99,000
మొత్తం	24,833	14,48,23,500

సీఎం జగన్‌తోనే సమన్యాయం



ముఖ్యమంత్రి జగన్‌తోనే కాపు సామాజిక వర్గానికి సమన్యాయం జరిగింది. గతంలో చంద్రబాబు రుణమాఫీ పేరుతో మహిళలను మభ్యపెట్టారు. కాపులకు ఏలాంటి భరోసా కల్పించలేదు. జగన్‌మోహన్‌రెడ్డికి తామంతా అండగా ఉంటాం. నాలుగు విడతల్లో రూ.60 వేలు కాపు నేస్తం లబ్ధిఅందింది. జగనే మా ధైర్యం,

– అద్దంకి ఆదిలక్ష్మి, సంపర, కాపు నేస్తం లబ్ధిదారు

అన్ని వర్గాలకు లబ్ధి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని సామాజిక వర్గాల వారికి లబ్ధి చేకూర్చే విధంగా అనేక పథకాలు అమలు చేశారు. వాటిలో భాగంగా కాపులకు కాపు నేస్తం పేరుతో తమను ఆదుకున్నారు. ఏడాదికి రూ.15వేలు చొప్పున నాలుగు విడతల్లో రూ.60వేలు పొందాను. మళ్లీ జగన్‌బాబునే సీఎంగా పట్టం కడతాం. జగన్ వెంటే మేముంటాం

– విజయదుర్గ, సంపర, కాపు నేస్తం లబ్ధిదారు

16 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ట్రాక్టర్‌పై లోడు చేసిన ధాన్యం

రాజానగరం: రబీ ధాన్యం కొనుగోలు కోసం మండలంలో ఏర్పాటు చేసిన 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. రాజానగరం, కానవరం, తోకాడ, ముక్కినాడ, నరేంద్రపురం, నందరాడ, కలవచర్ల, సీతారామపురం, వెలుగుబంద, పాలచర్ల, నామవరం, కొండగుంటూరు, సంపత్‌నగరం, జి.యర్రంపాలెం, పాతతుంగపాడు, కొత్తతుంగపాడులలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్, వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏఓ షేక్ ఇమామిఖాసిం ప్రారంభించారు. క్వింటాల్ గ్రేడ్ ఏ(ఫైన్ వెరైటీస్, ఆర్ఎస్ఆర్ 15048) ధాన్యానికి రూ.2203లు, గ్రేడ్ బి (కామన్ వెరైటీస్, ఎంటీయూ1121)కు రూ.2183, 75 కిలోల బస్తాకు గ్రేడ్ ఏ రకానికి రూ.1637, 40 కిలోలకు రూ.873, గ్రేడ్ బి రకానికి రూ.1652, 40 కిలోలకు రూ.881 మద్దతు ధర నిర్ణయించారని వ్యవసాయాధికారి ఖాసిం తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా మొదటి రోజు 334.40 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ముమ్మరంగా ఎన్నికల ప్రచారం
- ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థన



మహేంద్రవాడలోని రైస్ మిల్లులో కార్మికులను కలిసి మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే మహేంద్రవాడ తదితర గ్రామాల్లో ఉన్న వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులను కలుసుకుని మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలాలు అందుకున్న పేదలంతా సంతోషంగా ఉన్నారని అన్నారు. అవినీతి రహితంగా పారదర్శక పాలన అందించి, అర్హులైన ప్రతి ఒక్కరికి చెంతకే సంక్షేమ పథకాలు అందించి ఘనత జగనన్నకే దక్కుతుందనన్నారు. మోసపూరిత హామీలతో టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ఎన్నికలకు వస్తున్నారని, టీడీపీ నేతల మాటలు నమ్మితే మోసపోతారని అన్నారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాల రూపంలో కలిగిన లబ్ధిని ప్రతి లబ్ధిదారుడు గుర్తుంచుకోవాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగేందుకు మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేంద్రవాడ ఉపసర్పంచ్ మల్లిడి గంగరాజు, గ్రామానికి చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని మరోసారి స్వాగతించండి

ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి



దొడ్డిగుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి

రంగంపేట: ప్రజా ప్రభుత్వాన్ని మరోసారి స్వాగతించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి సతీమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి కోరారు. మండల పరిధిలోని దొడ్డిగుంట గ్రామంలో శుక్రవారం ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు, అనపర్తి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు ఆదిలక్ష్మికి ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపిస్తూ నిరాజనం పలికారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు అన్నారు. ఒక వైపు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏపీని అభివృద్ధి చేశారన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటేసి, వైఎస్ జగన్‌మోహనరెడ్డిని ముఖ్యమంత్రిగా, డాక్టర్ సూర్యనారాయణ రెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ఆదిలక్ష్మి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సర్పంచ్ కారి సంజీవరావు, ఎంపీటీసీ సభ్యురాలు మడికి లక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేపర్ మిల్లు యాజమాన్యం తీరు అప్రజాస్వామికం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

ప్రకాశం నగర్: ఏపీ పేపర్‌మిల్లు యాజమాన్యం తీరు అప్రజాస్వామికమని, నిరంకుశ విధానాలను విడనాడి తక్షణమే కార్మికుల న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు 72 గంటలుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికి అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ మాట్లాడుతూ మిల్లులోని కార్మిక సంఘాలు వేతన ఒప్పందం కోసం గత 6 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నాయని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టి.మధు మాట్లాడుతూ యాజమాన్యం తక్షణమే స్పందించి కార్మికుల ప్రతి డిమాండ్ నెరవేర్చాలన్నారు. లేనిపక్షంలో కార్మికుల కుటుంబాలతో అన్ని కార్మిక సంఘాల మద్దతు తీసుకుని నగరంలో భారీ ర్యాలీ చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ కార్యదర్శి జోజి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.రాజులోవ, ఎస్ఎస్ మూర్తి, మాధవ్, బి.పవన్ పాల్గొన్నారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: తాను పోలీసు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక రిజర్వ్ పోలీస్ గ్రౌండ్స్‌లోని రిటైర్ పోలీస్ అధికారుల అసోసియేషన్ హాలులో శుక్రవారం విశ్రాంత పోలీస్ అధికారుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రీనివాస్ మాట్లడుతూ తన తండ్రి అడిషనల్ ఎస్పీగా చేశారని, మేనమామలు, తాత కూడా పోలీస్‌శాఖ లోనే ఉద్యోగాలు నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. 25 ఏళ్లుగా నగరంలో పల్మనాలజిస్ట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నానని పేర్కొన్నారు. పదవుల కోసం పార్టీలు మారే సంస్కృతి తనది కాదన్నారు. రాబోయే ఎన్నికలలో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మహనీయుల స్ఫూర్తితో జగన్ సంక్షేమ పాలన



ప్రసాద్‌కు అండగా ఉంటానని భరోసానిస్తూ, సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: దేశం కోసం, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతీరావు పూలే స్ఫూర్తితో రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. దివాన్ చెరువులో శుక్రవారం రాత్రి నిర్వహించిన బాబూ జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవంలో ఎమ్మెల్యే రాజాతో పాటు ఎమ్మెల్సీ ఇజ్రాయెల్, ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పాల్గొన్నారు. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలను వారు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. పెత్తందారీ విధానానికి పెద్ద పీట వేసే చంద్రబాబు.. గతంలో జన్మభూమి కమిటీల ద్వారా ఏ విధంగా వేధించారో ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. రాబోయే ఎన్నికలలో ప్రజల కోసం పాటు పడే జగనన్న ప్రభుత్వానికి మరొకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ ఇజ్రాయెల్ మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఏ పాలకులు ఇవ్వనంత గౌరవాన్ని, ప్రాధాన్యతను దళితులకు ఇచ్చింది జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ జగజ్జీవన్‌రామ్ కేంద్ర వ్యవసాయ, ఆహార శాఖ మంత్రిగా పనిచేసిన కాలంలో దేశంలోని ఆహార సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ భార్య రాధికతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిరోముండనం కేసుతో వైఎస్సార్ సీపీకి సంబంధం లేదు

సీతానగరం మండలంలో గతంలో జరిగిన శిరోముండనం కేసుతో వైఎస్సార్ సీపీకి ఎటువంటి సంబంధం లేదని బాధితుడు ప్రసాద్ ప్రకటించారు. దివాన్ చెరువులో జరిగిన డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవంలో పాల్గొన్న అతను నాటి సంఘటనను ప్రస్తావిస్తూ, తనకు మరొక వ్యక్తికి మధ్య జరిగిన సంభాషణ ఫలితంగా జరిగిన ఘటనగా పేర్కొన్నారు. అయితే కొంతమంది వ్యక్తులు తమ రాజకీయ ప్రాభల్యం కోసం ఈ కేసు వైఎస్సార్ సీపీకి ఆపాదించి, జక్కంపూడి రాజా, గణేష్‌లకు చెడ్డ పేరు తీసుకురావాలనే ప్రయత్నించారన్నారు. నిజానికి తనకు న్యాయం జరగడం కోసం ఈ అన్నదమ్ములు ఎంతగానో కృషి చేశారన్నారు. జక్కంపూడి కుటుంబం ఆది నుంచీ దళితులకు అండగానే ఉంటోందన్నారు. దళితులకు ఏవిధమైన న్యాయం చేయాలన్నా వీరితోనే సాధ్యమన్నారు. ఇదే సమయంలో మీకు అండగా మేమెప్పుడూ ఉంటామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా భరోసానిచ్చారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

- ఆయన ఆశయ సాధనకు కృషి
- ఎమ్మెల్యేలు రాజా, సూర్యనారాయణరెడ్డి

సీతానగరం: దేశంలోని అణగారిన వర్గాల ప్రజల సంక్షేమం కోసం మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఇనుగంటివారిపేటలో సర్పంచ్ సత్యం రాంపండు ఆధ్వర్యంలో శుక్రవారం జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. బాబూ విగ్రహానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ దేశంలో అనేక సంస్కరణలు తీసుకురావడమే కాకుండా, పరిపాలనలో తన మార్కును చూపించి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. దేశంలోని ఆహార సమస్య పరిష్కారం కోసం హరిత విప్లవానికి నాంది పలికారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ - 2 సత్యం మదన్ బాబు, సాదె చంటిబాబు, మద్దాల కొండలరావు, ఉంగూరు నాగేంద్ర, గాడి రవికుమార్, బట్టు వెంకట్రాజు, తవిటికి శేఖర్, దూళ్లపల్లి కిరణ్, యల్లమిల్లి రాజు, మేరిపే శ్రీను, షేక్ ఇబ్రహీం, షేక్ మీరా, షేక్ ఖాదర్‌వలీ పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు.



అనపర్తిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



ఇనుగంటివారిపేటలో జగ్జీవన్‌రామ్ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో శుక్రవారం మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. అయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బూరుగుపూడి, దోసకాయలపల్లి, బుచ్చెంపేట, మధురపూడి, గాడాల తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. దొండపాటి చిన నాగేశ్వరరావు, ఉంద్రాజవరపు వెంకట్రావు, ముడిపుగట్టి చిన్ని, ఏడిద ప్రసన్న కుమార్, కొల్లి సుందరరావు, కుందేటి కిషోర్, యార్లగడ్డ గోపి, బాందపూడి శ్రీను పాల్గొన్నారు.

నన్నయ యూనివర్సిటీలో..

రాజానగరం: విద్యతోనే ఏ సమస్యనైనా అధిగమించగలమని నిరూపించి, దేశ చరిత్రలో తనదైన ప్రత్యేక ముద్ర వేసుకున్న మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యూనివర్సిటీలో జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు.పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. సూర్యారావుపేటలో జరిగిన వేడుకలలో సర్పంచ్ కుందేటి ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాపాక మోషే, స్థానికులు పాల్గొన్నారు.



పెదపూడిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్సై శోభన్‌కుమార్, గ్రామ పెద్దలు



దోసకాయలపల్లిలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలో పాల్గొన్న యువకులు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నన్నయ అధికారులు

సమ సమాజ హితుడు బాబూ జగ్జీవన్‌రామ్

అనపర్తి: కుల, మత రహితంగా సామాజిక సమానత్వం కోసం, నవభారత నిర్మాణం కోసం కృషి చేసిన పరిపాలనాదక్షత కలిగిన నాయకుడు, దీన జనోద్ధారకుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొండేటి భీమేష్, పార్టీ నాయకులు ఎస్.ఎస్.పాదూరి డేవిడ్ రాజు, పడాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెదపూడిలో

పెదపూడి: గ్రామంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శోభన్‌కుమార్, గ్రామ పెద్దలు యార్లగడ్డ అమ్మన్న చౌదరి, నల్లమిల్లి గంగిరెడ్డి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు దళిత ప్రతినిధులు, యూత్ పాల్గొన్నారు.